
సాక్షి
అనంతపురం
శనివారం । 9 । నవంబర్ । 2024



టన్ను చీనీ రూ.33 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.33 వేలు విక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.23

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.23, కనిష్టంగా రూ.10, సరాసరిన రూ.16 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
35.7°/17.2°

జిల్లా అంతటా శుక్రవారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

11లోగా 'ఫ్రీహోల్డ్' పరిశీలన పూర్తిచేయండి



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: ఫ్రీహోల్డ్ అసైన్‌మెంట్ భూముల పరిశీలన ప్రక్రియ ఈ నెల 11లోపు పూర్తి చేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. భూముల పరిశీలన అంశంపై కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్ నుంచి డీఆర్‌ఓ మలోలతో కలిసి ఆర్డీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫ్రీహోల్డ్ అసైన్‌మెంట్ భూముల ధ్రువీకరణకు సంబంధించి కంబదూరు, కుందుర్పి మండలాల్లో ఎక్కువగా పెండింగ్ ఉన్నాయన్నారు. 11వ తేదీలోగా పరిశీలన ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పారు. ఈ రెండు మండలాలపై ప్రత్యేకదృష్టి సారించాలని కళ్యాణదుర్గం ఆర్డీఓను ఆదేశించారు. పరిశీలన ప్రక్రియలో సిబ్బందికి సమస్యలు, సందేహాలు వస్తే తక్షణం వాటిని నివృత్తి చేసి ప్రక్రియ వేగవంతంగా జరిగేలా చూడాలన్నారు. పెండింగ్ అధికంగా ఉన్న మండలాల్లో ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు సంధ్య



సంధ్యను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరు: ఇటీవల నెల్లూరులో జరిగిన రాష్ట్రస్థాయి హాకీ క్రీడల్లో అనంతపురం జిల్లా తరఫున పాల్గొన్న ఆత్మకూరు మండలం సనప ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని సంధ్య సత్తా చాటిందని పీడీ నాగరాజు తెలిపారు. ఈ నెల 17వ తేదీన హర్యానా రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి హాకీ పోటీల్లో సంధ్య పాల్గొంటుందని పేర్కొన్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనందుకు హెచ్‌ఎం సుధ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు సంధ్యను అభినందించారు.

టమాటకు బీమా ప్రీమియం చెల్లించండి



టమాట

అనంతపురం అగ్రికల్చర్: రబీలో టమాట పంట సాగు చేసిన రైతులు బీమా పరిధిలోకి రావాలంటే తమ వాటా కింద ప్రీమియం చెల్లించాలని ఉద్యానశాఖ డీడీ బీఎంవీ నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రబీలో ఉద్యాన పంటలకు సంబంధించి వాతావరణ బీమా కింద టమాటను నోటిఫై చేశారన్నారు. టమాట సాగు చేసిన రైతులు ఈ–క్రాప్ నమోదుతో పాటు ఎకరాకు రూ.1,600 ప్రకారం డిసెంబర్ 15వ తేదీ లోపు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. కామన్ సర్వీసు సెంటర్ (సీఎస్‌సీ), ఆర్‌ఎస్‌కేల్లో సంప్రదించి 1–బీ, ఆధార్, బ్యాంకు అకౌంట్, పంట ధ్రువీకరణ పత్రాలు అందించి ప్రీమియం చెల్లించాలన్నారు. ఎకరాకు రూ.32 వేల ప్రకారం బీమా వర్తిస్తుందని తెలిపారు. మరిన్ని వివరాలకు ఉద్యానశాఖ అధికారులు లేదా బీమా పథకం అమలు చేసే అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ జిల్లా మేనేజర్ కేవీ కృష్ణసాగర్ (9912275799)ను సంప్రదించాలని సూచించారు.

60 మంది నియామకం



నియామకపత్రాలు అందజేస్తున్న ఏపీసీ నాగరాజు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న వివిధ టీచింగ్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు శుక్రవారం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో డీఈఓ ప్రసాద్‌బాబు, సమగ్రశిక్ష ఏపీసీ నాగరాజు చేతుల మీదుగా నియామకపత్రాలు అందించారు. మొత్తం 68 మందికి గాను 60 మంది అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. వీరంతా ఈనెల 11 నుంచి తమకు కేటాయించిన కేజీబీవీ, మోడల్ స్కూళ్లల్లో చేరాలని అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, జీసీడీఓ వాణీదేవి పాల్గొన్నారు.

4జీ.. సేవల్లో లేజీ

❒ ఉరవకొండలోని దుస్తులషాపులో పనిచేసే సత్యనారాయణ మొబైల్ రీచార్జ్ రేట్లు పెరిగాయని ప్రైవేట్ సర్వీస్ ప్రొవైడర్ నుంచి ప్రభుత్వ రంగ బీఎస్ఎన్ఎల్ కనెక్షన్‌కు మారాడు. నెట్ సిగ్నల్స్ పక్కన పెడితే ఫోన్‌లు కూడా సరిగా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

❒ విజయ్ మునిరాజ్ అనే కుర్రాడు స్విగ్గీ డెలివరీ బాయ్‌గా పనిచేస్తాడు. టారిఫ్ తక్కువని రెండు నెలల కిందట బీఎస్ఎన్ఎల్ తీసుకున్నారు. కానీ ఇప్పుడు కనీసం ఓటీపీలు కూడా రాకపోవడంతో కష్టమర్లతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మళ్లీ ప్రైవేటు సర్వీస్ ప్రొవైడర్‌కు మారాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పుకొచ్చాడు.



- అనంతపురం, వైఎస్సార్ జిల్లాల్లో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ సమస్య
- ఎక్కడా 4జీ సేవలు అందడం లేదని అధికారులకు ఫిర్యాదులు
- ఓ మోస్తరు టౌన్‌లోనూ బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ లేవంటూ గగ్గోలు
- ఫోన్‌పే, గూగుల్‌పే వంటివి అసలే పనిచేయని పరిస్థితి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఓ వైపు ప్రైవేటు మొబైల్ సర్వీసు ప్రొవైడర్లు రోజురోజుకూ వినియోగదారుల సంఖ్యను భారీగా పెంచుకుంటుండగా బీఎస్ఎన్ఎల్ మాత్రం వచ్చిన కస్టమర్లకు సేవలందించలేక చతికిలపడుతోంది. తమకు బీఎస్ఎన్ఎల్ సర్వీసులు కావాలని వచ్చిన వారికి 4జీ సర్వీసులు ఇవ్వలేకపోవడంతో లక్షలాదిమంది వినియోగదారులు బిత్తరచూపులు చూస్తున్నారు. కొద్ది నెలల క్రితం జియో, ఎయిర్‌టెల్ ప్రొవైడర్లు రీచార్జ్ రేట్లు పెంచడంతో చాలామంది వినియోగదారులు ఒక్కసారిగా బీఎస్ఎన్ఎల్‌కు మారారు. కానీ తీరా చూస్తే ఇప్పుడు నెట్‌వర్క్ లేదు. ఎరక్కపోయి ఇరుక్కున్నామన్న భావనతో కస్టమర్లు తీవ్రంగా మండిపడుతున్నారు.

కొత్తగా 1.85 లక్షల మంది కస్టమర్లు

రీచార్జ్ రేట్లు పెరిగాక చాలామంది సగటు కస్టమర్లు బీఎస్ఎన్ఎల్ వైపు మొగ్గు చూపారు. ఇందులో భాగంగా అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో 1.05 లక్షల మంది, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో 80 వేల మందికి పై చిలుకు వినియోగదారులు బీఎస్ఎన్ఎల్‌కు మారారు. మూడు నెలల క్రితం మారినా ఇప్పటికీ వారికి నెట్‌వర్క్ సరిగా రావడం లేదు. ఓ మోస్తరు టౌన్‌లో ఉన్నా సిగ్నల్స్ రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక పల్లెల్లో అయితే వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. మొబైల్‌లో మాత్రం 4జీ సర్వీసు చూపిస్తుంది, కానీ సిగ్నల్స్ రావు. దీంతో బీఎస్ఎస్ఎల్ కార్యాలయాల్లో ఫిర్యాదులు వెల్లువలా వచ్చి పడుతున్నాయి. . మరో వైపు ప్రైవేటు సర్వీసు ప్రొవైడర్లు 5జీ దాటుకుని 6జీ ఏర్పాట్లలో తలమునకలై ఉండటం విశేషం.

జిల్లాల వారీగా ఇటీవల బీఎస్ఎన్ఎల్‌కు మారిన కనెక్షన్ల వివరాలు	
అనంతపురం	1,05,000 పైగా
వైఎస్సార్ జిల్లా	80,000 పైగా
అనంతపురంలో టవర్లు	450 వరకు
'వైఎస్సార్'లో టవర్లు	350 వరకు

బీఎస్ఎన్ఎల్ 4జీ కష్టాలు ఇలా..

- కస్టమర్లకు ఫోన్‌పే పనిచేయడం లేదు.
- గూగుల్‌పే, ఎస్‌బీఐ యోనో వంటివి కూడా పనిచేయడం లేదు.
- ఆధార్ అప్‌డేట్ కోసం వెళితే ఓటీపీలు సైతం రావడం లేదు.

సాంకేతిక సమస్యలున్నాయి

బీఎస్ఎన్ఎల్ 4జీ సర్వీసుల విషయంలో కొన్ని సాంకేతిక సమస్యలున్నాయి. అందుకే సర్వీసు సరిగా లేదు. దీనిపై మా సిబ్బంది పనిచేస్తున్నారు. ఈ సమస్యలు త్వరలోనే సమసిపోతాయని భావిస్తున్నాం. వీలైనంత త్వరగా సమస్యను అధిగమించి నాణ్యమైన సేవలందిస్తాం.

–ముజీబ్ పాషా, బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్, అనంతపురం జోన్

- వర్క్‌ఫ్రం హోం చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సిగ్నల్స్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- కొన్నిచోట్ల టవర్ దగ్గర ఉన్న వాళ్లకు కూడా సిగ్నల్స్ రావడం లేదని ఆవేదన చెందుతున్నారు.
- ఇంటర్నెట్ డేటా అటుంచితే సాధారణ కాల్స్ కూడా పోవడం లేదని వాపోతున్నారు.
- రకరకాల సర్వీసుల్లో ఓటీపీలూ రావడం లేదని కస్టమర్ల ఆవేదన.

గొడవల జోలికి వెళ్లొద్దు



కంబదూరు పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

కళ్యాణదుర్గం రూరల్/ కంబదూరు: ప్రజలు గొడవల జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా కలసిమెలసి జీవించాలని ఎస్పీ జగదీష్ సూచించారు. కళ్యాణదుర్గం పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్‌ను, రూరల్ సర్కిల్ పోలీస్ స్టేషన్‌తో పాటు కంబదూరు పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు ఫైళ్లు పరిశీలించి, వివరాలు ఆరా తీశారు. అనంతరం కళ్యాణదుర్గంలో ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ మట్కా, గ్యాంబ్లింగ్, గంజాయి, ఆన్‌లైన్ బెట్టింగ్, లోన్ యాప్స్, వంటి వాటికి ప్రజలు దూరంగా ఉండాలన్నారు. చిన్న చిన్న విషయాలకు గొడవలు పడి కేసులు పెట్టుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ జీవితం నాశనం చేసుకోవద్దని సూచించారు. కళ్యాణదుర్గం పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా మట్కా, పేకాట, వంటి అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు తగుచర్యలు తీసుకున్నామన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. కంబదూరు స్టేషన్‌కు రెగ్యులర్ ఎస్ఐ, సిబ్బందిని నియమించాలని పలువురు విలేకరులు ఎస్పీకి విజ్ఞప్తి చేశారు.

సీసీ కెమెరాలతో చోరీలకు చెక్

గోళ్లలో నిర్వహించిన గ్రామసభలో ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ గ్రామాల్లోకి ప్రవేశించే చోట.. బయటకు వెళ్లే చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే చోరీలు జరగకుండా అడ్డుకట్ట వేయొచ్చన్నారు. కొత్త వ్యక్తులు గ్రామంలోకి ప్రవేశిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రవిబాబు, రూరల్ సీఐలు, వెంకటరమణ, వంశీకృష్ణ, నీలకంఠేశ్వర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించండి

- పేదల పట్ల సేవాదృక్పథం చూపండి
- కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం మెడికల్: గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ వైద్యులను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) హాల్‌లో ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ పెడికాన్– 2024 వర్క్‌షాప్ కార్యక్రమంలో కలెక్టర్ ప్రసంగించారు. సేవా దృక్పథంతో వైద్యులు ముందుకెళ్లాలన్నారు. ప్రైవేట్ మెడికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం కింద ఒక కమిటీ ఏర్పాటు చేశామన్నారు. గత 12 ఏళ్లుగా ఇది కార్యరూపం దాల్చకపోవడం తనను ఒకింత ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. ఈ చట్టం కింద వైద్యులను తీసుకున్నామని, వారు నిర్ణయాత్మకమైన అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలియజేయవచ్చని అన్నారు. ప్రైవేట్ వ్యక్తుల భూములను కొనుగోలు చేసి ఆస్పత్రులను నిర్మించుకోవచ్చని, కానీ అందుకు తగ్గ నిబంధనలు పాటించాల్సి ఉంటుందని చెప్పారు. వైద్య వృత్తిని నా మొదటి ఇల్లుగా భావిస్తానని, తాను ఏ స్థాయిలో ఉన్నప్పటికీ వైద్య సేవలు అందించడానికే ప్రథమ ప్రాధాన్యత ఇస్తానని వెల్లడించారు. సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో తొలి ప్రయత్నంలోనే అత్యధిక స్కోర్ సాధించడానికి మెడికల్ సైన్స్ ఎంతో దోహదపడిందన్నారు. వైద్య సేవల కోసం ప్రజలు బెంగళూరులాంటి ప్రాంతాలకు వెళ్లకుండా జిల్లా కేంద్రం అనంతపురంలోనే సేవలు పొందగలిగేలా ఉండాలని కోరుకుంటున్నానన్నారు. మూడు రోజుల వర్క్‌షాప్‌ను వైద్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, పీఓడీటీ డాక్టర్ సుజాత, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అనిల్ కుమార్, కార్యదర్శి డాక్టర్ ఏఎస్ కిరీటి, సర్వజనాస్పత్రి చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ రవికుమార్, కార్యనిర్వహణ కార్యదర్శి డాక్టర్ డి.పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'అపార్' ప్రక్రియ వేగవంతం కావాలి

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యార్థుల 'అపార్' అప్‌డేషన్ ప్రక్రియ వేగవంతం కావాలని కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. నగరంలోని అరవిందనగర్‌లో గల శ్రీకృష్ణదేవరాయ నగరపాలక ఉన్నత పాఠశాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అపార్ అప్‌డేషన్ ఏవిధంగా జరుగుతోందో పరిశీలించారు. అక్కడి నుంచి హమాలీకాలనీలోని 44వ వార్డు సచివాలయాన్ని తనిఖీ చేశారు. అక్కడా అపార్ అప్‌డేషన్‌కు జరుగుతున్న ప్రక్రియను పరిశీలించి ఏమైనా ఇబ్బందులున్నాయా? అని సిబ్బందిని అడిగారు. అక్కడి నుంచి అనంతపురం రూరల్ ఎమ్మార్సీని తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ అపార్ జనరేషన్‌కు సంబంధించి ఎప్పటికప్పుడు రిపోర్ట్ అందజేయాలన్నారు. ఎస్కేడీ పాఠశాలలో 656 మంది విద్యార్థులకు గాను ఇప్పటిదాకా 245 మందికి అపార్ జనరేట్ చేశారని, తక్కిన విద్యార్థులకు కూడా వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ కేశవ నాయుడు, డీఈఓ ప్రసాద్‌బాబు, నగరపాలక సంస్థ కమిషనర్ నాగరాజు, అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వరరావు, తహశీల్దార్ హరికుమార్, ఏపీఎం నాగరాజు, ఎంఈఓలు వెంకటస్వామి, సరితారాణి ఉన్నారు. సాయంత్రం అపార్ అప్‌డేషన్ ప్రక్రియపై మరోమారు కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థుల అపార్ అప్‌డేషన్ ప్రక్రియ చేపట్టేందుకు ఆర్డీఓలు, డీఎల్డీఓలు, విద్యాశాఖ, మునిసిపల్ అధికారులు, ఆధార్ నోడల్ ఆఫీసర్ సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఎంఈఓ–1,2 ఇద్దరూ ఇందులో భాగస్వామ్యం కావాలని ఆదేశించారు. వీసీలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్‌శర్మ, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, డీఈఓ ప్రసాద్‌బాబు, డీవీఈఓ వెంకటరమణనాయక్, విద్యాశాఖ ఏడీ నాగరాజు, సీఎంఓ గోపాల్, ఏపీఎం నాగరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలే టార్గెట్

- సోషల్ మీడియా పోస్టులపై అరెస్టు సరికాదు
- సుప్రీం తీర్పును ఉల్లంఘిస్తున్న పోలీసులు

అనంతపురం: కూటమి సర్కారు ప్రశ్నించే స్వరాన్ని ఆదిలోనే భయపెడితే.. భవిష్యత్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు కట్టడి చేయవచ్చని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని ఉక్కుపాదం మోపుతోంది. రాజకీయ పార్టీల కార్యకర్తలు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా తప్పొప్పులను ఎత్తిచూపడం సహజం. అయితే తమను తప్పు పట్టేవారి పట్ల రాష్ట్ర ప్రభుత్వం కర్కశంగా ప్రవర్తిస్తోంది. అధికార టీడీపీ, జనసేన పార్టీల సోషల్‌మీడియా కార్యకర్తలపై కేసు నమోదు చేయడానికి సాహసించని పోలీసులు.. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులైన సోషల్‌మీడియా కార్యకర్తలనే టార్గెట్ చేసుకుని ఏకంగా నాన్‌బెయిలబుల్, పదేళ్లు శిక్ష పడే సెక్షన్లు నమోదు చేస్తున్నారు. వాస్తవానికి సోషల్ మీడియాలో పెట్టే పోస్టులపై క్రిమినల్ కేసులు నమోదు చేయకూడదన్న సుప్రీం కోర్టు తీర్పును ఉల్లంఘిస్తున్నారు.

ఉల్లంఘించడమే

కూటమి సర్కార్‌కు చెందిన ఫేస్‌బుక్‌లో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఫొటోలను మార్ఫింగ్ చేశారన్న ఆరోపణతో ఆత్మకూరు మండలం మదిగుబ్బకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త జింకల రామాంజనేయులును ఈ నెల ఐదో తేదీన అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం అరెస్ట్ చేసినట్లు చూపిస్తూ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. 14 రోజుల రిమాండ్ విధిస్తూ మేజిస్ట్రేట్ ప్రతిమ ఆదేశాలు జారీ చేశారు. వాస్తవానికి ఎవరినైనా అరెస్ట్ చేస్తే 24 గంటల్లో మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచాలని రాజ్యాంగం ప్రాథమిక హక్కులో భాగంగా కల్పించిన వెసులుబాటు. ఇది అతిక్రమించిన అధికారులపై హెబియస్ కార్పస్ కింద రిట్ వేసి సంజాయిషీ కోరవచ్చు. ఈ నేపథ్యంలోనే జింకల రామాంజనేయులు వ్యవహారంలో హెబియస్‌కార్పస్ కింద రిట్ వేస్తూ హైకోర్టులో కేసు దాఖలు చేశారు. నాలుగురోజుల తరువాత అరెస్ట్ చేసినట్లు చూపించి రామాంజనేయులు ప్రాథమిక హక్కును ఉల్లంఘించిన ఇటుకలపల్లి సీఐ హేమంత్‌కుమార్‌పై చర్యలు తప్పవని న్యాయనిపుణులు పేర్కొంటున్నారు.



రామాంజనేయులును కోర్టుకు తీసుకొచ్చిన పోలీసులు

- సోషల్‌మీడియాలో పోస్టులపై ఏకంగా నాన్‌బెయిలబుల్ సెక్షన్ అయిన 386 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అంటే ఎవరినైనా చంపుతామని బెదిరిస్తే ఈ సెక్షన్ కింద కేసు నమోదు చేయొచ్చు. అయితే సోషల్‌మీడియాలో యాక్టివ్‌గా ఉన్నారన్న నెపంతోనే అడ్డుగోలు సెక్షన్లు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు వాపోతున్నారు.

రైతులను ఆదుకోవాల్సిందే

- 63 మండలాలనూ 'కరువు' జాబితాలో చేర్చాలి
- స్థాయీసంఘ సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ





మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, చిత్రంలో సీఈఓ వెంకటసుబ్బయ్య, సమావేశాలకు హాజరైన జెడ్పీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు

అనంతపురం సిటీ: వరుస తుపానుల కారణంగా కురిసిన ఎడతెరిపిలేని వర్షాలకు పంటలు దారుణంగా దెబ్బతిన్నాయని, నష్టాల్లో కూరుకుపోయిన రైతులను ఆదుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లాపరిషత్‌లో చైర్‌పర్సన్ సమక్షంలో స్థాయీ సంఘం–3 (వ్యవసాయం) సమావేశం గుమ్మఘట్ట జెడ్పీటీసీ సభ్యుడు అధ్యక్షతన జరిగింది. వ్యవసాయ శాఖపై చర్చను ప్రారంభించిన గిరిజమ్మ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 63 మండలాల్లోనూ ఖరీఫ్ పంటలు దెబ్బతింటే ప్రభుత్వం 14 మండలాలను మాత్రమే కరువు ప్రాంతాలుగా గుర్తించడం అన్యాయమన్నారు. ఉమ్మడి జిల్లా అంతటినీ కరువు జాబితాలో చేర్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని అధికారులకు సూచించారు. నిబంధనలను పక్కనపెట్టి రైతులను ఆదుకోవాలని గుమ్మఘట్ట జెడ్పీటీసీ మహేశ్, నల్లమాడ జెడ్పీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు.

ఉన్నతాధికారుల గైర్హాజరుపై ఆగ్రహం

స్థాయీ సంఘ సమావేశాలకు, జెడ్పీ సర్వసభ్య సమావేశాలకు కిందిస్థాయి సిబ్బందిని పంపి గైర్హాజరవుతున్న శ్రీసత్యసాయి జిల్లా అధికారులపై సభ్యులు డాక్టర్ గోరంట్ల బాషా, జయరాం నాయక్, శ్రీనివాసులరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తరచూ డుమ్మా కొడుతున్న అధికారులపై చర్యలు తీసుకోకపోతే సమావేశాలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ స్పందిస్తూ గైర్హాజరయ్యే అధికారులను ప్రభుత్వానికి సరెండర్ చేసేలా చర్యలు తీసుకోవాలని సీఈఓ వెంకటసుబ్బయ్యకు సూచించారు. అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని, ప్రభుత్వ కార్యక్రమాలకు తమను ఆహ్వానించడం కానీ, సమాచారం పంపడం కానీ ఏదీ చేయడం లేదని అనంతపురం రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్ సమావేశం దృష్టికి తెచ్చారు. మండలంలోని అన్ని హైస్కూళ్లు, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమ ఉపాధ్యాయులు ఒక్కరూ లేరని బ్రహ్మసముద్రం జెడ్పీటీసీ ప్రభావతి అధికారుల దృష్టికి తెచ్చారు. చలికాలం సమీపిస్తున్నందున హాస్టళ్లు, గురుకులాల్లో కిటికీలు, తలుపులు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు బాషా కోరారు. మధ్యాహ్న భోజనం నాసిరకంగా వడ్డిస్తుండడంతో విద్యార్థులు తినలేక ఇళ్ల నుంచి క్యారియర్లు కట్టుకొని బడికి పోవాల్సి వస్తోందని బుక్కరాయసముద్రం జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్ సభ దృష్టికి తీసుకువచ్చారు. సోమందేపల్లి హైస్కూల్‌లో టపాసుల దుకాణాల నిర్వహణకు ఎలా అనుమతి ఇచ్చారని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ డీఈఓ కిష్టప్పను ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.80 కోట్లు విడుదల చేయకుండా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడటం ప్రభుత్వానికి మంచిది కాదన్నారు.

విధులకు డుమ్మా కొట్టి.. ప్రైవేట్‌గా పనిచేసి..

అనంతపురం అర్బన్ పరిధిలో కొందరు అంగన్‌వాడీ వర్కర్లు తమ విధులకు డుమ్మా కొట్టి ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్నారని, అలాంటి వారిని గుర్తించి ఉద్యోగాల నుంచి తొలగించాలని జెడ్పీటీసీ సభ్యుడు చంద్ర డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఓ అంగన్‌వాడీ వర్కర్ ఒకరు తన భర్త జిల్లా ముఖ్య అధికారి వద్ద సీసీగా పని చేస్తుండాన్ని అడ్డుపెట్టుకొని పదేళ్లుగా అంగన్‌వాడీ సెంటర్‌కే వెళ్లడం లేదని ఆరోపించారు. మరికొందరు సీనియర్ అంగన్‌వాడీలు వయసు మీరినా తప్పుడు ధ్రువీకరణతో సర్వీసులోనే కొనసాగుతున్నారని, అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ఐసీడీఎస్ పీడీ డాక్టర్ శ్రీదేవి స్పందిస్తూ.. సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

టమాట మార్కెట్‌లో ఏమిటీ దోపిడీ?

అనంతపురం శివారులోని కక్కలపల్లి వద్ద టమాట మార్కెట్‌కు వచ్చి వెళ్లే వాహనాల నుంచి లారీ అసోసియేషన్ పేరిట వాహనాన్ని బట్టి రూ.500 నుంచి రూ.3వేల వరకు వసూలు చేస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్ ఆరోపించారు. అయితే ఈ డబ్బు పంచాయతీకి గానీ, కార్పొరేషన్‌కు గానీ, మరే ఇతర ప్రభుత్వ శాఖకు పన్ను రూపంలో జమ చేయకుండా దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. జెడ్పీ చైర్‌పర్సన్ కల్పించుకుని మార్కెటింగ్, డీపీఓ, పోలీస్ శాఖలు సమన్వయంతో దోపిడీ సంగతి తేల్చాలని, అవసరమైతే లారీ అసోసియేషన్ వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, ప్రభుత్వాదాయాన్ని కాపాడాలని సూచించారు. హిందూపురం మార్కెట్ యార్డులోనూ ఇష్టారాజ్యంగా బ్రోకర్లు ధరలు నిర్ణయించి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని లేపాక్షి జెడ్పీటీసీ శ్రీను ఆరోపించారు.

'ఉపాధి' 150 రోజులకు పెంచాలి

ఉపాధి హామీ పథకం ఎంతో మంది ఆకలి తీరుస్తోందని, వంద రోజుల పనిదినాల సంఖ్యను 150కు పెంచాలని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ అధికారులను కోరారు. రోజు కూలి రూ.500కు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జెడ్పీ చైర్‌పర్సన్, సీఈఓ సమక్షంలో డ్వామా పీడీకి వినతిపత్రం అందజేశారు. ఇతర స్థాయీ సంఘ సమావేశాలకు సంబంధించి ఆయా శాఖాధిపతులు తమ శాఖల ప్రగతిని చదివి వినిపించారు. వాటిపై సభ్యులు అనేక అంశాలను లేవనెత్తి, చర్చించారు.

క్లుప్తంగా

అంకితభావంతో విధులు నిర్వర్తించండి



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: ప్రజలతో సన్నిహితంగా మెలుగుతూ అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సిబ్బందిని ఎస్పీ పి.జగదీష్ ఆదేశించారు. పోలీసు పరేడ్ మైదానంలో అనంతపురం, అనంతపురం రూరల్ సబ్ డివిజన్ల సిబ్బంది, ఏఆర్ సాయుధ బలగాల పరేడ్‌ను శుక్రవారం ఆయన పరిశీలించి, మాట్లాడారు. ఆరోగ్యం మెరుగుదల, ఫిజికల్ ఫిటినెస్ కోసం రోజూ గ్రౌండ్ ప్రాక్టీస్ చేయాలన్నారు. ఎస్కార్ట్ గార్డు, తదితర విధుల్లో నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏ చిన్న పొరపాటు జరిగినా పోలీసుశాఖ ప్రతిష్ట దిగజారే ప్రమాదముందున్నారు. అనంతరం సిబ్బందితో ముఖాముఖిగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఇలియాజ్ బాషా, డీఎస్పీలు వి.శ్రీనివాసరావు, టి.వెంకటేశ్వర్లు, ఎస్.మహబూబ్‌బాషా, పలువురు సీఐలు, ఆర్ఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.

దొంగలను పట్టుకున్న రైతులు



రైతులకు పట్టుబడిన దొంగలు

బత్తలపల్లి: పంట పొలాల్లో రైతులు అమర్చుకున్న బిందు, తుంపర సేద్యం పరికరాలను అపహరించుకెళుతున్న ఇద్దరిని రైతులు బంధించి పోలీసులకు అప్పగించారు. వివరాలు... బత్తలపల్లిలోని జగనన్న లేఅవుట్ కాలనీ సమీపంలో ఓ రైతు గురువారం తన పొలానికి నీరు పెట్టి సాయంత్రం ఇంటికి చేరుకున్నాడు. కాసేపటి తర్వాత పొలానికి బయలుదేరిన ఆయన మార్గ మధ్యంలో కేబుల్ వైర్లను కాలుస్తున్న ముగ్గురు అపరిచితులను గుర్తించి వారి పక్కన చేరి మౌనంగా పరిశీలించాడు. ఆ చుట్టుపక్కల కత్తిరించి పడేసిన కేబుల్‌ను గమనించి ఆగంతకులు గమనించకుండా తన కుమారుడికి ఫోన్ చేసి విషయం తెలిపాడు. సమాచారం అందుకున్న గ్రామంలోని రైతులు మూకుమ్మడిగా అక్కడకు చేరుకుంటుండగా గమనించిన దుండగులు అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో రైతులు వెంటాడి ఇద్దరిని పట్టుకున్నారు. మరొకడు తప్పించుకున్నాడు. పట్టుబడిన ఇద్దరికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. విచారణలో ఒకరు కంబదూరుకు నివాసి కాగా, మరొకరు వేంపల్లి వాసిగా పోలీసులు గుర్తించారు. బత్తలపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద గుడారాలు వేసుకుని పగలు వ్యాపారాలు చేసుకుంటూ, రాత్రి దొంగతనాలకు పాల్పడుతున్నట్లుగా నిర్ధారణ అయింది. నిందితులను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఈ తీర్పే ఫైనల్



- న్యాయ పరిష్కారంలో వాది, ప్రతివాది ఇద్దరూ విజేతలే
- సుప్రీం కోర్టు తీర్పుతో సమానంగా జాతీయ లోక్‌అదాలత్ సేవలు

డిసెంబర్ 14న జాతీయ లోక్‌అదాలత్



ఉమ్మడి అనంతపురం జిల్లా న్యాయస్థానం

అనంతపురం: యువ దంపతుల మధ్య గొడవలు నెలకొన్నప్పుడు ఇరువైపులా పెద్దలు సమావేశమై వారికి నచ్చజెప్పి రాజీ కుదర్చడం చూస్తుంటాం. ఈ విధానం చాలా సందర్భాల్లో సమస్యని కోర్టు వరకు వెళ్లకుండా సామరస్యంగా సమిసిపోయేలా చేస్తుంది. ఈ పద్ధతినే అన్ని రకాల వివాదాలకూ వర్తింపజేస్తే బాగుంటుందన్న ఆలోచన నుంచి 'మధ్యవర్తిత్వం' విధానం వచ్చింది. ఈ అంశానికి తగిన ప్రాధాన్యతనివ్వడం ద్వారా న్యాయస్థానాల మీద కేసుల భారాన్ని తగ్గించవచ్చని లోక్ అదాలత్‌లు నిరూపించాయి. ప్రతి సమస్యను కోర్టు ముంగిటకు తీసుకెళ్లకుండా మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకుంటే విలువైన సమయం, డబ్బూ కూడా ఆదా అవుతుందని న్యాయ నిపుణులు అంటున్నారు.

వివాదాలతో చిక్కులు ఇలా...

- జిల్లా కేంద్రంలోని ఇద్దరు మిత్రులు ఉమ్మడి పెట్టుబడితో ఓ వ్యాపారాన్ని ప్రారంభించారు. వ్యాపారం బాగా జరుగుతూ ఆర్థికంగా బలపడిన సమయంలో ఇద్దరి మనస్పర్థలు చోటు చేసుకున్నాయి. లెక్కల్ని తారుమారు చేసి చూపుతున్నాడనే అపనమ్మకం ఇద్దరిలోనూ బలపడి విడివిడిగా కోర్టులో కేసులు వేశారు. ఈ క్రమంలో ఎవరికి వారు కేసు గెలవాలని పంతానికి పోయారు. ఫలితం... బాగా జరుగుతున్న వ్యాపారం కాస్త మూతపడింది.
- జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన ఇద్దరు రైతులకు పక్కపక్కనే పొలాలు ఉన్నాయి. ఈ క్రమంలో పంటకు కాలువ నీరు పెట్టే విషయంలో ఇద్దరి మధ్య గొడవ చోటు చేసుకుని కొట్టుకునే స్థాయికి వెళ్లింది. ఎవరికి వారు బంధుజనాన్ని పోగేసుకుని కిందామీద పడి కొట్టుకున్నారు. కొందరికి కాళ్లు, చేతులు విరిగాయి. దీంతో పోలీసు కేసు నమోదై, ఏళ్ల తరబడి కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తోంది.

.... ఎవరికి వారు కేసు గెలవాలన్న పంతానికి పోవడంతో ఎన్నో రకాల వివాదాలు న్యాయస్థానాల్లో అపరిష్కృతంగానే ఉన్నాయి. ఫలితంగా ఆయా కేసులకు సంబంధించి కోర్టు ఖర్చులు, లాయరు ఫీజులు ఇతరత్రా అన్ని కలిపి కక్షిదారులపై భారం తడిసి మోపడవుతోంది. ఇలాంటి తరుణంలో జాతీయ లోక్ అదాలత్ మధ్యేమార్గంగా తీర్పులు వెలువరిస్తుంది.

'సుప్రీం' తీర్పుతో సమానం..

సమస్యను సామర్యసంగా అర్థం చేసుకుంటే ఎంత పెద్ద వివాదాన్నైనా సులువుగా పరిష్కరించుకోవచ్చునని జాతీయ లోక్ అదాలత్‌లు నిరూపించాయి. కక్షిదారులను ఏకం చేసి, ప్రశాంత జీవనం గడిపేలా చేయడమే జాతీయ లోక్‌అదాలత్ న్యాయవాదుల ముఖ్య ఉద్దేశ్యం. అన్ని రకాల కోర్టులలో పెండింగ్‌లో ఉన్న మోటార్ వాహనాల ప్రమాద కేసులు, సివిల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, కుటుంబ తగాదాలు (విడాకుల కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ చేయదగిన క్రిమినల్ కేసులు, ప్రిలిటిగేషన్ కేసులకు చక్కటి పరిష్కారాన్ని జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు చూపుతున్నారు. సాధారణ కోర్టులో వెలువడిన తీర్పు వెలువడితే ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించే వీలుంది. అయితే జాతీయ లోక్‌అదాలత్ ఇచ్చిన తీర్పులు సుప్రీం కోర్టు తీర్పులతో సమానం... అదే అంతిమం కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో కేసులను పరిష్కారం చేసుకోవాలనుకునే కక్షిదారులకు జాతీయ లోక్ అదాలత్ ఓ వరంగా మారింది.

ఇరువురూ విజేతలే..

సాధారణంగా కోర్టు వివాదాల్లో చిక్కుకున్న కక్షిదారులు ఇద్దరిలో అంతిమంగా ఒక్కరినే విజయం వరిస్తుంది. అయితే జాతీయ లోక్ అదాలత్ వెలువరించి తీర్పులో ఇద్దరూ విజేతలుగానే నిలుస్తున్నారు. సివిల్ కేసుల్లో జాతీయ లోక్‌అదాలత్‌లో పరిష్కారం దక్కితే అప్పటి వరకూ వారు చెల్లించిన కోర్టు ఫీజులు సైతం వెనక్కి చెల్లిస్తారు. బ్యాంకులో రుణం తీసుకుని కట్టకుండా ఏళ్ల తరబడి ఉన్న కేసులను సైతం ఒన్ టైం సెటిల్‌మెంట్ ద్వారా పరిష్కరిస్తున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 13 ప్రాంతాల్లోని 26 బెంచుల్లో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహణకు రంగం సిద్ధమైంది. అనంతపురం జిల్లా కోర్టు ప్రాంగణంలోని అన్ని కోర్టులతో పాటు ఉమ్మడి జిల్లా పరిధిలోని అన్ని కోర్టుల్లోనూ డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నారు. ఒకే రోజు 5 వేల కేసులకు పరిష్కారం చూపే దిశగా న్యాయమూర్తులు కసరత్తు చేపట్టారు. అన్ని విభాగాల అధికారులనున సమన్వయం చేసుకుని లోక్‌అదాలత్‌ను విజయవంతం చేసేలా కృషి చేస్తున్నారు.

జాతీయ లోక్‌అదాలత్ మంచి వేదిక



న్యాయ పరిష్కారం కోరుకుంటున్న కక్షిదారులకు జాతీయ లోక్ అదాలత్ మంచి వేదిక. రాజీ చేయదగిన కేసులన్నింటినీ పరిష్కరించేందుకు ఇదొక మంచి అవకాశం. ఈ తీర్పులకు తిరుగు లేదు. కక్షిదారులకు డబ్బు, సమయం ఆదా అవుతుంది. సివిల్ కేసుల్లో న్యాయపరిష్కారం పొందితే కోర్టు ఫీజులు సైతం వెనక్కి చెల్లిస్తాం. డిసెంబర్ 14న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌కు సంబంధించి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 13 ప్రాంతాల్లో 26 బెంచ్‌లు ఏర్పాటు చేశాం. ఈ అంశంపై ఇప్పటికే ఆయా పరిధిలోని జడ్జిలతో సమీక్షించాం. గత లోక్‌అదాలత్‌లో ఏకంగా 6 వేల కేసులకు పరిష్కారం దక్కింది. తాజా మరో 5 వేల కేసులను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాం.

– జి. శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి

అంతర్ కళాశాలల పురుషుల క్రీడాపోటీలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభిస్తున్న దృశ్యం

గుంతకల్లు: స్థానిక శంకరనందాగిరి స్వామి డిగ్రీ కళాశాలలో శుక్రవారం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాల అంతర్ కళాశాలల పురుషుల క్రీడాపోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వర్సిటీ రిజిస్టర్ డాక్టర్ రమేష్ బాబు, స్పోర్ట్స్ సెక్రటరీ డాక్టర్ బి.జెస్సీ, కళాశాల కరస్పాండెంట్ కేసీ హరి, కళాశాల చైర్మన్ మురళి, తదితరులు హాజరయ్యారు. విద్యార్థుల్లో పోటీ తత్వంతో పాటు స్నేహభావాన్ని పెంపొందించేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. చదువులతో పాటు క్రీడల్లోనూ ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, వ్యాయామ ఉపాధ్యాయుడు బాషా తదితరులు పాల్గొన్నారు. కాగా, కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్ తదితర విభాగాల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోని కళాశాలల క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలు మూడు రోజుల పాటు జరగనున్నాయి.

ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ శిబిరానికి ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న జేఎన్‌టీయూఏ ఇన్‌చార్జ్ వీసీ హెచ్.సుదర్శనరావు, తదితరులు

అనంతపురం: జేఎన్‌టీయూఏ క్యాంపస్ కళాశాలలో ఈసీఈ మూడో సంవత్సరం చదువుతున్న ఎస్.వెంకటేష్‌నాయక్, ఓటీపీఆర్ఐలో ఎమ్మెస్సీ ఫుడ్‌టెక్నాలజీ చదువుతున్న జి. నందిత న్యూఢిల్లీలో జరిగే ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ శిబిరానికి ఎంపికయ్యారు. జలగావ్‌లోని కవయిత్రి బహినాబాయి చౌదరి నార్త్ మహారాష్ట్ర యూనివర్సిటీ వేదికగా ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు జరిగే క్యాంప్‌లో వీరు ప్రత్యేక శిక్షణ పొందనున్నారు. ఎంపికైన విద్యార్థులను జేఎన్‌టీయూఏ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ శారద అభినందించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం ప్యాకెట్లు చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

బ్రహ్మసముద్రం: మండలంలోని పాలవెంకటాపురం గ్రామంలో శుక్రవారం కళ్యాణదుర్గం ఎక్సైజ్ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. నాగమణి అనే మహిళ తన ఇంట్లో అక్రమంగా నిల్వ చేసి, విక్రయిస్తున్న 96 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని అరెస్ట్ చేశారు. తనిఖీల్లో ఎక్సైజ్ సీఐ లక్ష్మి, సుహాసిని, ఎస్ఐ నరేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

జీఓ 143ని తక్షణమే రద్దు చేయాలి

- మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల కోదండరామిరెడ్డి



ఉరవకొండ: వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులకు నరకప్రాయమైన జీఓ 143ని తక్షణమే రద్దు చేయాలని కూటమి సర్కార్‌ను మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల కోదండరామిరెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో దాదాపు 50 మంది ఉద్యోగులు ఏళ్ల తరబడి జిల్లా కేంద్రంలోనే తిష్ట వేసుకున్నారని, అలాంటి వారిని గుర్తించి గ్రామీణ ప్రాంతాలకు బదిలీ చేయాలని కోరారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న వివిధ హోదాల్లోని ఉద్యోగుల్లో చాలా మంది వివిధ కారణాలతో మృతి చెందారని, దాదాపు రెండు దశాబ్దాల పాటు సేవలు అందించిన వారి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. మృతి చెందిన ఉద్యోగి కుటుంబానికి ప్రభుత్వం కేవలం రూ.2 లక్షలు చెల్లించి చేతులు దులుపుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ యజమాని చనిపోయిన తర్వాత ఆ కుటుంబం రోడ్డున పడుతుందనే విషయాన్ని ప్రభుత్వ పెద్దలు విస్మరించడం బాధాకరమన్నారు. మృతి చెందిన ఉద్యోగి కుటుంబసభ్యులకు రూ.20 లక్షలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

అంగన్‌వాడీలో వర్కర్.. ప్రైవేట్ కాలేజీలో లెక్చరర్!

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తనిఖీల్లో బహిర్గతం
- మెమో ఇవ్వడంతో ఉన్నతాధికారుల పైనే రుబాబు

అనంతపురం సెంట్రల్: నగరంలో ఓ అంగన్‌వాడీ వర్కర్ తన విధులకు డుమ్మా కొట్టి ప్రైవేట్ కాలేజీలో లెక్చరర్ అవతారమెత్తారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తనిఖీలో ఈ విషయం బట్టబయలైంది. వివరాలు... అనంతపురం నగరంలోని బుడ్డప్పనగర్‌లో ఓ అంగన్‌వాడీ సెంటర్‌ను సంబంధిత సూపర్‌వైజర్ శుక్రవారం తనిఖీ చేశారు. ఆ సమయంలో హెల్పర్ మాత్రమే విధుల్లో ఉన్నారు. వర్కర్ గురించి ఆరా తీస్తే పనిపై బయటకు వెళ్లినట్లు సహాయకురాలు సమాధానమిచ్చింది. దీంతో వర్కర్‌కు సూపర్‌వైజర్ ఫోన్ చేయడంతో తాను సెంటర్‌లోనే ఉన్నట్లు ఆమె బుకాయించారు. దీంతో సదరు అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని లబ్ధిదారులతో వర్కర్ పనితీరుపై సూపర్‌వైజర్ ఆరా తీయడంతో అసలు విషయం బయటపడింది. అంగన్‌వాడీ వర్కర్ చుట్టపు చూపుగానే కేంద్రానికి హాజరవుతున్నారని, ఆమె పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తోందని తెలుసుకున్న సూపర్ వైజర్ ఒక్కసారిగా ఖంగుతిన్నారు. దీంతో అంగన్‌వాడీ వర్కర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. నోటీసుపై సదరు అంగన్‌వాడీ వర్కర్ సరైన వివరణ ఇవ్వకపోగా సూపర్‌వైజర్‌పై ఎదురుదాడికి దిగినట్లు సమాచారం. కొంతమంది యూనియన్ నేతల మద్దతు కూడగట్టుకుని శుక్రవారం సీడీపీఓ కార్యాలయానికి చేరుకుని హైడ్రామాకు తెరతీసినట్లు తెలిసింది. సూపర్‌వైజర్‌ను వెంటనే మార్చాలంటూ దాదాపు రెండు, మూడు గంటల పాటు సీడీపీఓ లలితతో వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. అంతటితో ఆగక సూపర్‌వైజర్ ఇచ్చిన మెమోను ఉన్నతాధికారుల సమక్షంలో చించేసినట్లు తెలిసింది. తప్పుచేసిన అంగన్‌వాడీ వర్కర్ రెచ్చిపోయి నానా హంగామా చేసినా ఆమెపై చర్యలు తీసుకునేందుకు ఐసీడీఎస్ అధికారులకు ధైర్యం చాలడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై సూపర్‌వైజర్‌ను వివరణ కోరగా... తాను తనిఖీకు వెళ్లినప్పుడు అంగన్‌వాడీ వర్కర్ విధుల్లో లేరన్నారు. దీనిపై తాను రిపోర్ట్ రాయడంతో వారు అలా చేశారన్నారు. సీడీపీఓ లలితమ్మను వివరణ కోరగా... అంగన్‌వాడీ వర్కర్‌ను సంజాయిషీ కోరామని, అయితే ఎలాంటి గొడవ జరగలేదన్నారు. తాను ట్యూటర్‌గా వెళుతున్నట్లు మాత్రమే వర్కర్ చెప్పుకొచ్చారని తెలిపారు.

వేధింపుల కేసులో యువకుడి అరెస్ట్

గుత్తి: మహిళను వేధింపులకు గురి చేసిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. గుత్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సురేష్ తెలిపిన మేరకు... గుత్తి ఆర్ఎస్‌కు చెందిన ఓ మహిళను, అదే ప్రాంతానికి చెందిన యువకుడు గోవర్ధన్ వేధించేవాడు. తన మాట వినకపోతే చంపుతానని బెదిరించాడు. దీంతో భయాందోళనకు గురైన ఆమె ఈ నెల 5న పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో రెండు రోజుల క్రితం గోవర్ధన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తే తప్పించుకుని పారిపోయాడు. అనంతపురంలోని పాతూరులో తన బంధువుల ఇంట్లో తలదాచుకున్నట్లుగా గుర్తించిన పోలీసులు శుక్రవారం అక్కడికెళ్లి గోవర్ధన్‌ను అరెస్ట్ చేసి, గుత్తి పీఎస్‌కు తరలించారు.

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక




షేక్ దాదాపీర్ షాకీర్ బాషా



సాయి తరుణ్ కుమార్ రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ఆలిండియా సివిల్ సర్వీసెస్ బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు జిల్లా నుంచి ఇద్దరు ఉద్యోగులు ఎంపికయ్యారు. రెండు రోజుల కిందట విజయవాడలో ఎంపిక పోటీలు జరిగాయి. ఇందులో అనంతపురం డీఈఓ కార్యాలయంలో టైపిస్ట్‌గా పని చేస్తున్న షేక్ దాదాపీర్ షాకీర్‌బాషా, పామిడి మండలం రామరాజుపల్లి సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పి.సాయితరుణ్‌కుమార్‌రెడ్డి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఏపీ జట్టులో చోటు సంపాదించారు. 2025 జనవరిలో ఢిల్లీలో ఆలిండియా సివిల్ సర్వీసెస్ బాస్కెట్‌బాల్ పోటీలు జరగనున్నాయి. ఆయా శాఖల అధికారులతో పాటు సిబ్బంది షాకీర్‌బాషా, తరుణ్‌కుమార్‌రెడ్డిని అభినందించారు.


వర్షితకు డీఈఓ అభినందన



వర్షితను అభినందిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం: జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14 అథ్లెటిక్స్ బాలికల విభాగంలో ప్రాతినిథ్యం వహించే ఏపీ జట్టులో చోటు దక్కించుకున్న ఎ.వర్షితను డీఈఓ ప్రసాద్‌బాబు శుక్రవారం అభినందించారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆమె 400 మీటర్లు, 600 మీటర్ల పరుగులో సత్తా చాటి రెండు బంగారు పతకాలతో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను దక్కించుకున్న విషయం తెలిసిందే. గుంతకల్లు మండలం ఎన్.నరసాపురం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఆమె ఈ నెలలో జార్ఖండ్‌లోని రాంచిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ క్రమంలో బుధవారం డీఈఓ ప్రసాద్‌బాబు, సమగ్రశిక్ష ఏపీసీ నాగరాజు, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ సుగుణమ్మ, హెచ్ఎం బి.శ్రీనివాసులు తదితరులు ఆమెను అభినందించారు.

ఎద్దు నోరు ఛిద్రం



పామిడి: పేలుడు పదార్థం తిని ఓ ఎద్దు నోరు ఛిద్రమైంది. పామిడి మండలం వంకరాజుకాలువ గ్రామంలో శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. రైతు దూదేకుల బాబుకు చెందిన ఎద్దు అదే గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసరెడ్డి పొలం సమీపంలో మేపు కోసం వెళ్లింది. అయితే అప్పటికే అడవి పందులను వేటాడేందుకు వేటగాళ్లు ఉంచిన పేలుడు పదార్థాన్ని నమలడంతో ఒక్కసారిగా ఎద్దు నోరు ఛిద్రమైంది. విచారణలో పేలుడు పదార్థాన్ని కండ్లపల్లికి చెందిన ఎరికల మహేష్ ఉంచినట్లుగా నిర్ధారణ అయింది. కాగా, ఎద్దు బతకడం కష్టమైందని, దీంతో రూ.60 వేలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

మూడు నెలలుగా అందని వేతనాలు



కలెక్టర్ వినోద్‌కుమార్‌కు సమస్యలను వివరిస్తున్న ఎస్సీ మునిసిపల్ కార్మిక సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: నగర పాలక సంస్థలో పని చేస్తున్న తమకు మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని కలెక్టర్ వి.వినోద్ కుమార్‌కు ఎస్సీ మునిసిపల్ కార్మికుల సంఘం నాయకులు విన్నవించారు. శుక్రవారం కలెక్టర్‌ను ఆయన చాంబర్ వద్ద సంఘం గౌరవాధ్యక్షుడు తిరుపాల్, అధ్యక్షుడు అజయ్‌బాబు, తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. సంస్థలో పనిచేస్తున్న మలేరియా, కోవిడ్, గార్బేజ్ కార్మికులు, మినీ జేసీబీ, క్లాప్ ఆటో డ్రైవర్లకు మూడు నెలలుగా వేతనం ఇవ్వలేదని పేర్కొన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. జీతాలు రాని కారణంగా పండుగలు చేసుకోవడం అటుంచితే చివరికి కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందన్నారు. మునిసిపల్ అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వేతన సమస్యలపై అధికారులతో చర్చించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు సురేష్ బాబు, కోశాధికారి ఓబుళేసు, నాయకులు వెంకట నరసయ్య, లక్ష్మన్న, జోసెఫ్, శివయ్య పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

అనంతపురం రూరల్: హామీలను అమలు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను నిలువునా మోసం చేస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ మండిపడ్డారు. శుక్రవారం రాజీవ్‌కాలనీ పంచాయతీలో ప్రజా సమస్యలపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చిన కూటమి పెద్దలు అధికారం చేపట్టిన తర్వాత వాటిని విస్మరించి ప్రజలను మోసగిస్తున్నారని ధ్వజమెత్తారు. నిత్యావసరాల ధరలను నియంత్రించకుండా ప్రజలపై మరింత భారం మోపుతున్నారన్నారు. రాష్ట్రంలో మహిళలు, దళితులు, బాలికలపై దాడులు, అత్యాచారాలు జరుగుతున్నా మంత్రులు స్పందించకుండా ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ తప్పించుకోవడం సిగ్గుచేటన్నారు. ఉచిత ఇసుక అందించాలన్నారు. ప్రతి ఒక్కరికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పి ఇప్పుడు కొంతమందికే ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. కరెంట్ చార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చి.. ఇప్పుడు చార్జీలు పెంచడం దుర్మార్గమన్నారు. రైతుల మోటార్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం సిగ్గుచేటన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి రామిరెడ్డి, సీపీఎం నాయకులు మసూద్‌వలి, నూరుల్లా, డేవిడ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

'స్కూల్ రికార్డులు మార్చడం సరికాదు'

అనంతపురం ఎడ్యుకేషన్: 'అపార్' నమోదు కోసం విద్యార్థుల ఆధార్‌లో మార్పులు చేయాల్సిందిపోయి.. స్కూల్ రికార్డులు మార్చడానికి విద్యాశాఖ ఉత్తర్వులు ఇవ్వడం సరికాదని రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నల్లపల్లి విజయ్‌భాస్కర్ మండిపడ్డారు. శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. దేశ వ్యాప్తంగా విద్యార్థులందరికీ ఒకే గుర్తింపు కార్డు ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) అమలు చేస్తోందని పేర్కొన్నారు. అపార్ జనరేట్ కావాలంటే స్కూల్ రికార్డు, యూడైస్, ఆధార్ ఇలా మూడింటిలోనూ వివరాలు ఒకే విధంగా ఉండాలన్నారు. స్కూల్ రికార్డ్, యూడైస్‌లో ఒకే విధంగా ఉన్నా ఆధార్‌కార్డులో మరో విధంగా ఉండటంతో అపార్ నమోదు ఆలస్యమవుతోందన్నారు. విద్యార్థులకు ప్రతి విషయంలోనూ స్కూల్ రికార్డు మాత్రమే ప్రామాణికంగా ఉంటుందన్నారు. అయితే అపార్ నమోదుకు పాఠశాల రికార్డులు మార్పు చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం బాధాకరమన్నారు. తగినంత సమయం ఇచ్చి ప్రతి సచివాలయంలోనూ ఆధార్ అప్‌డేషన్ కేంద్రం ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారమవుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఆధార్‌కు అనుగుణంగా స్కూల్ రికార్డులు మార్పు చేయాలనే ఉత్తర్వులను రద్దు చేసి ఆధార్‌కార్డుల సవరణకు సెంటర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

'పురం'లో మాయమవుతున్న పిల్లులు !

- కొన్ని రోజులుగా కనిపించకుండా పోతున్న పెంపుడు పిల్లులు
- పిల్లులను పట్టుకెళ్లి చంపి తింటున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు



సీఐకు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని మేళాపురంలో గత కొన్ని రోజులుగా పెంపుడు పిల్లులు మాయమవుతున్నాయి. తొలుత ఒకరిద్దరి ఇళ్లలో పిల్లులు మాయమైనా... ఆ తర్వాత వరుసగా ఇలాంటి ఘటనలే వెలుగు చూస్తుండడంతో స్థానికుల్లో ఆందోళన మొదలైంది. దీంతో మేళాపురం పబ్లిక్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ప్రత్యేక నిఘా ఉంచారు. ఈ క్రమంలో మేళాపురం సర్కిల్‌లోని భారతీనగర్ చెరువు కట్ట వద్ద గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్న సంచార జాతుల వారిపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. రోజూ దేవుడి ప్రతిమను నెత్తిన పెట్టుకుని కాలనీల్లో సంచరిస్తూ డబ్బు, బియ్యం, బ్యాళ్లు సేకరించుకునే వీరు... ఇళ్ల వద్ద గమనిస్తూ ఎవరూ లేని సమయంలో పెంపుడు పిల్లుల మెడకు ఉచ్చు వేసి తీసుకెళుతున్నారని, అనంతరం వాటిని చంపి తింటున్నారంటూ శుక్రవారం ఉదయం వన్‌టౌన్ సీఐ రాజగోపాలనాయుడుకు ఫిర్యాదు చేశారు. సంచార జాతుల వారిని కట్టడి చేయాలని విన్నవించారు. దీనిపై విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

మహిళపై లైంగిక వేధింపులు

గార్లదిన్నె: మండలంలోని కొప్పలకొండకు చెందిన ఓ మహిళపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు... గ్రామానికి చెందిన ఓ మహిళ శుక్రవారం ఉదయం గొర్రెలను మేపేందుకు గ్రామ శివారులోని పొలాల వద్దకు వెళ్లింది. నిర్జన ప్రదేశంలో ఒంటరిగా కనిపించిన ఆమెపై అదే గ్రామానికి చెందిన చంద్రాయుడు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

కనగానపల్లి ఎస్ఐగా మహమ్మద్ రిజ్వాన్



కనగానపల్లి: కనగానపల్లి నూతన ఎస్ఐగా ఎస్.మహమ్మద్ రిజ్వాన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఇషాక్ బాషా బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో కర్నూలు జిల్లా కొతాలం పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న మహమ్మద్ రిజ్వాన్‌ను ఇక్కడికి బదిలీ చేసినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ సిబ్బంది నూతన ఎస్ఐకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి సాధారంగా స్వాగతం పలికారు.

16 నుంచి కడప అమీన్ పీర్ దర్గా ఉరుసు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కడప అమీన్ పీర్ దర్గా ఉరుసు ఈనెల 16 నుంచి 21 వరకూ జరగనుంది. శుక్రవారం నగరపాలక సంస్థలో ఉరుసుకు సంబంధించిన పోస్టర్లను మేయర్ వసీం ఆవిష్కరించారు. ఉరుసును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అబూ సలేహా, వైఎస్సార్‌సీపీ నాయకులు గంగాధర్, కడప అమీన్ పీర్ దర్గా మురిద్ తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియల్లో ఆప్తులై..



మృతదేహాన్ని తీసుకెళ్తున్న ఐఎంఎం ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: ఐఎంఎం ఆర్గనైజేషన్ మహబూబ్ బాషా మిత్రబృందం ఆధ్వర్యంలో శుక్రవారం మతాలకతీతంగా ఓ వృద్ధుడికి అంత్యక్రియలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగరంలోని కోవూరు నగర్‌కు చెందిన 90 ఏళ్ల రామన్న శుక్రవారం మరణించాడు. కొడుకులు, బిడ్డలు ఉన్నప్పటికీ వారు ఆస్తి గొడవలతో రాలేకపోయారు. దిక్కుతోచని రామన్న భార్య వాణి ఐఎంఎం ఆర్గనైజేషన్‌కు ఫోన్ చేసి సమస్యను చెప్పుకుంది. స్పందించిన ఐఎంఎం ఆర్గనైజేషన్ మహబూబ్ బాషా మిత్రబృందం అంత్యక్రియలు చేశారు. బిడ్డల కర్కశత్వం చూస్తుంటే చనిపోతోంది మనుషులు మాత్రమే కాదని.. మానవత్వం కూడా చనిపోయేలా ఉందని ఆవేదన చెందారు. ఐఎంఎం కుల మతాలకతీతంగా సేవాకార్యక్రమాలు చేపడుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహమ్మద్ ఇస్మాయిల్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలు ప్రారంభం



ఫ్యాక్ట్‌సెట్ ఇండియా ప్రైవేట్ కంపెనీ ప్రతినిధులను ఆహ్వానిస్తున్న ప్రిన్సిపాల్

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఫ్యాక్ట్‌సెట్ ఇండియా ప్రైవేట్ కంపెనీ ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఈసీఈ, సీఎస్ఈ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా 31 మంది ఫైనల్ రౌండ్‌కు చేరారు. ఉద్యోగానికి ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.10 లక్షల ప్యాకేజీ అందించనున్నట్లు కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చెన్నారెడ్డి కంపెనీ ప్రతినిధులను ఆహ్వానించారు. కాగా.. క్యాంపస్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ జే.శ్రీనివాసులు ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు.

26న దేశవ్యాప్త నిరసన

అనంతపురం టవర్‌క్లాక్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు కార్మిక వ్యతిరేక విధానాలు, నల్ల చట్టాలు, లేబర్ కోడ్స్ రద్దు చేయాలనే డిమాండ్‌తో ఈనెల 26న దేశవ్యాప్త నిరసన చేపట్టనున్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి తదితరులు మాట్లాడారు. ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ సాగే ర్యాలీ, ధర్నాలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, చంద్రశేఖరరెడ్డి, మల్లికార్జున, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలరంగయ్య, ఉపాధ్యక్షులు గోపాల్, వెంకటనారాయణ, మత్స్యజా రామాంజనేయులు, శ్యామల్మ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఇండ్ల ప్రభాకరరెడ్డి, నాగరాజు, ముత్యాలు, ఆజంబాషా, చంద్రిక, ఎర్రిస్వామి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఎండలోనే కూర్చున్న దివ్యాంగులు



ఆస్పత్రిలోకి మోకాళ్లపై వెళ్తున్న ఓ దివ్యాంగుడు



ఓ దివ్యాంగుడిని స్క్రీనింగ్ కోసం తీసుకెళ్తున్న దృశ్యం

పాపం.. దివ్యాంగులు

- ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ మెడికల్ బోర్డు సర్టిఫికెట్‌కు అవస్థలు
- ఉదయం 8 గంటల నుంచే పడిగాపులు
- మధ్యాహ్నం 2 గంటలకు స్క్రీనింగ్ ప్రారంభం
- వసతుల కల్పనలో విఫలమైన సర్వజనాస్పత్రి ఉన్నతాధికారులు



కుమారుడికి నీరు తాగిస్తున్న దృశ్యం



ఆస్పత్రి వద్ద పడిగాపులు కాస్తున్న దివ్యాంగులు, వారి కుటుంబ సభ్యులు

అనంతపురం మెడికల్: కూటమి ప్రభుత్వంలో వికలాంగులకు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ మెడికల్ బోర్డు సర్టిఫికెట్ కోసం ప్రభుత్వం వారంలో మంగళవారం, శుక్రవారం సర్వజనాస్పత్రిలో స్క్రీనింగ్ నిర్వహిస్తోంది. ఆర్థో, మానసిక, న్యూరో, విభాగం వైద్యులు స్క్రీనింగ్ చేపట్టి నడవలేని స్థితిలో మంచానికే పరిమితం అయిన వారికి పింఛన్ మంజూరుకు సిఫార్సు చేస్తారు. కాగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచే దివ్యాంగులు స్క్రీనింగ్ కోసం పడిగాపులు కాశారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి స్క్రీనింగ్ ప్రక్రియ చేపట్టారు. స్క్రీనింగ్ జరిగే ప్రాంతంలో దివ్యాంగులకు కనీసం కూర్చునేందుకు బల్లలను ఏర్పాటు చేయకపోగా.. షామియానా వేయలేదు. దీంతో నడవలేని స్థితి ఉన్న వారిని వారి కుటుంబీకులు ఎత్తుకుని వైద్యుల వద్దకు తీసుకెళ్లారు. కాళ్లు లేని వారు దోక్కాడుకుంటూ వెళ్లారు.

పర్యవేక్షణ ఏదీ?

దివ్యాంగుల సర్టిఫికేషన్ జరిగే ప్రాంతంలో సర్వజనాస్పత్రి ఉన్నతాధికారులు అటువైపు తొంగిచూడలేదు. తమకేం పట్టదన్న ధోరణిలో ఉండిపోయారు. సెక్యూరిటీ సిబ్బందిని పురామయించి పట్టీపట్టనట్లు వ్యవహరించారు. వాస్తవంగా రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్లు అందుబాటులో ఉండి దివ్యాంగులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి. కానీ రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్లు పత్తా లేకుండా పోవడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది.

వైద్యుల సీట్లలో ఎంఎన్‌ఓలు



సర్టిఫికెట్ స్క్రీనింగ్ కోసం వచ్చే దివ్యాంగులను వైద్యుల వద్దకు తీసుకెళ్లేందుకు మేల్ నర్సింగ్ ఆర్డర్లీ, ఫీమేల్ నర్సింగ్ ఆర్డర్లీలను ఏర్పాటు చేయడంలో సర్వజనాస్పత్రి ఉన్నతాధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రోగులను తరలించాల్సిన ఎంఎన్‌ఓలు వైద్యులు సీట్ల పక్కన కూర్చుని స్టాంప్ డ్యూటీకి ఉన్నారు. న్యూరో సర్జరీ విభాగం వైద్యులు సంతకం చేసి స్టాంప్ కూడా వేయలేని స్థితిలో విధులు నిర్వర్తిస్తున్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అందులోనూ వైద్యులతో పాటు ఎంఎన్‌ఓలను కూర్చో పెట్టుకుని పిచ్చాపాటి చేసిన దృశ్యాలు శుక్రవారం స్క్రీనింగ్ వద్ద కనిపించాయి. దోక్కాడుకుంటూ వచ్చిన దివ్యాంగులు వారి బాధను ఎవరితో చెప్పుకోలేక గంటల తరబడి బయటే నిరీక్షించాల్సి వచ్చింది. మంత్రి సత్యకుమార్ ఇలాకాలో దివ్యాంగులు పడుతున్న అవస్థలు, వైద్యుల బాధ్యతారాహిత్యంపై చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.



దివ్యాంగులను తీసుకెళ్తున్న కుటుంబీకులు

సౌకర్యాలు కల్పిస్తాం

సర్టిఫికెట్ల కోసం వచ్చే వారికి తగు ఏర్పాట్లు చేశాం. మంచాలు వేయించాం. సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావుతో మాట్లాడి మరిన్ని సౌకర్యాలు కల్పిస్తాం. ఎంఎన్‌ఓలను స్టాంప్ డ్యూటీకి మేమే వేశాం. వికలాంగులను ఎంఎన్‌ఓ, ఎఫ్ఎన్‌ఓలు తరలించే అంశాన్ని పరిశీలిస్తాం. వికలాంగులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ హేమలత, ఇన్‌చార్జ్ ఆర్ఎంఓ

వైఎస్ జగన్‌ను కలసిన నాయకులు



వైఎస్ జగన్‌తో జేసీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, కార్పొరేటర్ సాకే చంద్ర



వైఎస్ జగన్‌ను కలసిన డీలర్ల సంఘం మాజీ నగరాధ్యక్షుడు చెన్నారెడ్డి

అనంతపురం కార్పొరేషన్: మాజీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, 33వ డివిజన్ కార్పొరేటర్ సాకే చంద్ర శుక్రవారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాజీ సీఎంకు పుష్పగుచ్ఛం అందించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్ జగన్ వారికి సూచించారు. అలాగే అనంతపురం డీలర్ల సంఘం మాజీ నగరాధ్యక్షుడు చెన్నారెడ్డి కూడా వైఎస్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించారు. మాజీ సీఎం జగన్‌ను కలసిన వారిలో జానీ, సాకే మహేష్, సాకే రాజు, సాకే మల్లి, సాకే రమణ, శషా, రమేష్, గుజ్జల అనిల్ తదితరులు ఉన్నారు.

పకడ్బందీగా ఓటరు నమోదు

రాప్తాడు: ప్రత్యేక ఓటరు నమోదు, సవరణల కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ విజయకుమారి ఆదేశించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈడీటీ సువర్ణ ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమ నిర్వహణపై బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. స్పెషల్ సమ్మరీ రివిజన్-2025లో భాగంగా ప్రత్యేక ఓటరు నమోదు, సవరణల కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈనెల 9, 10, 23, 24వ తేదీల్లో మండలంలోని అన్ని గ్రామాల పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు ఓటర్లకు అందుబాటులో ఉండాలన్నారు. ఫారం-6, ఫారం-7, ఫారం-8, 8ఏ అవసరాలు, ఓటు నమోదు అంశాలను వివరించాలని తెలిపారు. ఎలాంటి తప్పులు లేని ఓటరు జాబితాను తయారు చేయాలన్నారు. 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీఎల్వోలు, సూపర్‌వైజర్లు ఈ కార్యక్రమానికి గైర్హాజరైనట్లు తెలిస్తే వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాగే కరుణాకర్, బీఎల్వోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ విజయకుమారి

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోండి

అనంతపురం రూరల్: ఎన్నికల ప్రధాన అధికారి ఉత్తర్వుల మేరకు రెండు రోజుల పాటు ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ కేశవనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శని, ఆదివారాల్లో అనంతపురం అర్బన్ నియోజకవర్గ బూత్ స్థాయి అధికారులు, బీఎల్‌ఓలు రెండు రోజుల పాటు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫారం-6 ఓటరు నమోదు, ఫారం-7 తొలగింపు, ఫారం-8 మార్పు, సవరణ కోసం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించాలని ఆదేశించారు.

రాయలసీమ పోరాట యోధుడు 'పప్పూరు'



పప్పూరు రామాచార్యులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రచయితలు, కవులు

అనంతపురం కల్చరల్: స్వాతంత్ర్య సమరయోధుడిగా, శ్రీబాగ్ ఒడంబడికలో కీలక పాత్ర పోషించిన పప్పూరు రామాచార్యులు జీవితం ఆదర్శప్రాయమని పలువురు వక్తలు కొనియాడారు. శుక్రవారం సాయంత్రం అనంత సాహితీ సంస్థలు సంయుక్తంగా స్థానిక విశాలాంధ్ర బుక్ హౌస్ ప్రాంగణంలో పప్పూరు 128వ జయంతి సందర్భంగా సంస్మరణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పప్పూరు రామాచార్యులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు వెలుగు టీవీరెడ్డి, జాషువా పీఠం ప్రధాన కార్యదర్శి నాగలింగయ్య, అనంత సాహితీ ప్రస్థానం అశ్వర్థరెడ్డి తదితరులు మాట్లాడారు. నాటి స్వాతంత్ర్యోద్యమంలో యువతలో చైతన్యం నింపడానికి నాడు ప్రచురించిన 'వదరుబోతు' వ్యాసాలు ఎంతో ప్రసిద్ధి చెందాయన్నారు. 1926లో సాధన పత్రిక ద్వారా జాతీయ ఉద్యమాన్ని ప్రజల ముంగిటకు తెచ్చారని తెలిపారు. హాస్యవ్యంగ్యాత్మకంగా సాగిన సాహితీ వ్యాసాలు ఈనాటికీ చైతన్యపూరితంగానే ఉంటాయన్నారు. రాయలసీమ ఉద్దండుల్లో ఒకరైన పప్పూరు రామాచార్యుల సంపాదకీయాలు రాయలసీమ వెనకబాటుతనాన్ని ప్రశ్నించాయని పేర్కొన్నారు. గ్రంథాలయ స్థాపనలో ఆయన పాత్ర ఎనలేనిదని వెల్లడించారు. కార్యక్రమంలో చెట్ల ప్రవీణ్, విజయ భాస్కరరెడ్డి, హరీష్, తిమ్మప్ప, అశోక్ కుమార్, సుబ్బారాయుడు పాల్గొన్నారు.

విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవు



మరూరు సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ బుల్లే విజయలక్ష్మి

రాప్తాడు: గ్రామ సచివాలయ ఉద్యోగులు తమ విధులకు సక్రమంగా హాజరు కాకపోతే చర్యలు తప్పవని ఎంపీడీఓ బుల్లే విజయలక్ష్మి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని మరూరు గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సచివాలయంలో అటెండెన్స్ రిజిస్టర్‌తో పాటు పలు రిజిష్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు సకాలంలో సంక్షేమ పథకాలను అందిచడానికే గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరికి కుల, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించాలన్నారు. పథకాలను ప్రతి ఇంటికి అందించాల్సిన బాధ్యత సచివాలయ ఉద్యోగులపై ఉందన్నారు. సంక్షేమ పథకాలు తమకు సక్రమంగా అందడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు రాకూడదన్నారు. సిబ్బంది కూడా విధులకు సక్రమంగా హాజరుకావాలన్నారు. అనంతరం మరూరు, రాప్తాడు పంచాయతీలోని మైనార్టీ కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను తనిఖీ చేశారు. సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. నాణ్యతలో తేడాలోస్తే బిల్లులు మంజూరు కావని కాంట్రాక్టర్లకు సూచించారు. అలాగే గోకులం షెడ్‌ను మార్కింగ్ చేయించి గ్రౌండింగ్ పనులు చేపట్టారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

రామగిరి: నసనకోట సమీపంలో ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయాన్నే అమ్మవారిని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉమ్మడి జిల్లా, కర్ణాటకకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రతి ఆది, మంగళ, శుక్రవారాల్లో దేవదాయశాఖ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు.

'ఆ కేసులో తోపుదుర్తి కుటుంబానికి సంబంధం లేదు'



మాట్లాడుతున్న బాధితురాలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: నాలుగు రోజుల క్రితం తనపై దాడి జరిగిన ఘటనలో దాడి చేసిన వ్యక్తిపై అనంతపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. అతడిపై కేసు కూడా నమోదైంది. ఈ కేసు విషయంలో తోపుదుర్తి కుటుంబానికి గాని, తోపుదుర్తి చందుకు ఎలాంటి సంబంధం లేదని బాధితురాలు శుక్రవారం ఓ వీడియో ద్వారా విలేకరులకు తెలియజేసింది. బాధితురాలు మాట్లాడుతూ.. బి.యాలేరు గ్రామానికి చెందిన తనపై నాలుగు రోజుల క్రితం ఇదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దాడి చేశాడు. అతడిపై అనంతపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. అయితే దాడి చేసిన వ్యక్తికి తోపుదుర్తి కుటుంబం, తోపుదుర్తి చందు అండగా నిలిచారంటూ కొన్ని పత్రికలు ప్రచారం చేయడంలో వాస్తవం లేదని తెలిపింది. తోపుదుర్తి కుటుంబం తమకు మొదటి నుంచి ఎంతో అండగా నిలిచిందని.. కష్టసుఖాల్లో తోపుదుర్తి కుటుంబమే ఆదుకుందని గుర్తు చేసింది. తోపుదుర్తి చందుపై కక్షతో కొంతమంది దురుద్దేశంతో ఇలా పత్రికల్లో రాయించారని ఆవేదన వ్యక్తం చేసింది. అంతేకాకుండా మిలటరీ ఈశ్వరయ్య ఇతర మహిళలపై దాడి చేయలేదని వెల్లడించింది. ఆధారాలు లేకుండా ఇలా నిరాధరమైన ఆరోపణలు చేయడం మంచిది కాదని బాధితురాలు వాపోయింది.

కోనాపురంలో వైద్య శిబిరం



వృద్ధులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కనగానపల్లి: మండలంలోని కోనాపురం గ్రామంలో శుక్రవారం వైద్య ఆరోగ్య సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ సందర్భంగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. విష జ్వరాలు, దోమల నివారణ, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ మనోహర్ బాబు, హెల్త్‌సూపర్‌వైజర్ శ్రీనివాసులు, హెల్త్‌అసిస్టెంట్లు విక్టోరియా, మోహన్ కుమార్, వాసు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, చిత్రంలో డీసీ వెంకటేశ్వర్లు

అనంతపురం కార్పొరేషన్: ఆస్తి, ఖాళీ జాగా పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థలో రెవెన్యూ సిబ్బందితో వారు సమావేశమయ్యారు. మార్చి వచ్చే వరకు వేచి ఉండకుండా ఎప్పటికప్పుడు పన్ను వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. పన్ను కట్టని వారికి నోటీసులు జారీ చేయాలన్నారు. అదే విధంగా ఆస్తి పన్ను నిర్ధారించేటప్పుడు నిబంధనల మేరకు పన్నును ఫిక్స్ చేయాలని తెలిపారు. రెవెన్యూ విభాగానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను తక్షణం నివృత్తి చేయాలన్నారు. సమావేశంలో ఆర్ఓలు సతీష్, సుజాత, ఆర్ఐలు మురళీ, బాబు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్వీ'లో క్రీడా సంబరాలు



క్రీడలను ప్రారంభిస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాల ఏర్పడి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం క్రీడా, ఎత్నిక్‌డే సంబరాలు జరుపుకున్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ సి.సోమశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సి.చక్రధర్‌రెడ్డి క్రీడలను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్కేయూ క్రీడా విభాగం ఆచార్యులు జెస్సీ మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితాలకు క్రీడలు చాలా అవసరం అన్నారు. ప్రతి విద్యార్థీ ఏదో ఒక క్రీడను నిత్యం అలవరుచుకోవాలన్నారు. ఎత్నిక్ డేలో భాగంగా విద్యార్థులు, అధ్యాపకులు సంప్రదాయ దుస్తులతో అలరించారు. అనంతరం ఏర్పాటు చేసిన వేదికపై విద్యార్థులు ర్యాంప్ వాక్ చేసి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీనివాసులు, ఏట శ్రీనాథ్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో భవిష్యత్ చిత్తు



మాట్లాడుతున్న జిల్లా సివిల్ జడ్జి శివప్రసాద్

అనంతపురం ఎడ్యుకేషన్: డ్రగ్స్‌కు అలవాటు పడితే యువత జీవితాలు బుగ్గిపాలవుతాయని జిల్లా సివిల్ జడ్జి జి.శివప్రసాద్ హెచ్చరించారు. జిల్లా న్యాయ సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో 'న్యాయ విజ్ఞాన సదస్సు' ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాగా కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మద్యానికి బానిసలు కావొద్దన్నారు. బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ర్యాగింగ్ జోలికి వెళ్లొద్దన్నారు. లక్ష్యం పెట్టుకుని కష్టపడితే కచ్చితంగా ఆశించిన ఫలితాలు లభిస్తాయన్నారు. తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చేందుకు ప్రతి విద్యార్థి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది పి.పద్మ, డాక్టర్ బీఎస్ శ్రీదేవి, ప్రిన్సిపాల్ డాక్టర్ సి.ప్రభాకర్‌రాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు బాబాఫకృద్దీన్, రామకృష్ణ, ఎన్‌సీసీ ఆఫీసర్లు జైనుబేగం, మురళీ పాల్గొన్నారు.